

ఎమ్మెల్సీ కోదండరామ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న శ్యామ్‌సుందర్, రామాచారి

ప్రొ. జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేస్తాం

మన్సూరాబాద్, సెప్టెంబర్ 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధనకు నిరంతర పోరాటం చేసిన ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతామని తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు గోర శ్యామ్‌సుందర్, ప్రధాన కార్యదర్శి మారోజు రామాచారి పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌కు సోమవారం వారు కలిశారు. జ్ఞాపికను అందజేసి సత్కరించారు.



పోటీల్లో ఆరవ స్థానంలో నిలిచిన సహస్ర

స్పెల్ బీ పోటీల్లో సత్తాచాటిన బీపీడీఏవీ విద్యార్థిని

చంపాపేట, సెప్టెంబర్ 16(ఆంధ్రజ్యోతి): కంచన్‌బాగ్ మిధానీ టౌన్‌షిప్‌లోని బ్రహ్మప్రకాష్ డీఏవీ విద్యార్థిని బి.సహస్ర ఇటీవల బెంగళూరులో నిర్వహించిన స్పెల్ బీ పోటీల్లో సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్ వీఎస్ ప్రశాంత్ సోమవారం తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థి బి.సహస్ర ఆరవస్థానంలో నిలిచిందన్నారు. విద్యార్థులలో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు పోటీ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. కేవలం పాఠ్యాంశాలే కాకుండా అన్ని రంగాలలో రాణించేందుకు కబడ్డీ, యోగా, కరాటే, స్పెల్ బీ వంటి వాటిని విద్యార్థులకు నేర్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థిని అభినందన కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గౌరీ శంకర్‌రావు, ఏఆర్ఓ ఆనందవల్లి, ఎల్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దాడిలో గాయపడిన విజయేందర్‌రెడ్డి అతని భార్య, అల్లుడు

కారుతో ఢీకొట్టి.. ఆపై దాడి చేసి

● మద్యం మత్తులో రచ్చ చేసిన యువకులు

చాదర్‌ఘాట్, సెప్టెంబర్ 16(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఉన్న యువకులు కారు నడుపుతూ ఎదురుగా వెళ్తున్న మరో కారును ఢీకొట్టిన ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. ముసారాంబాగ్ శాలివాహననగర్ కాలనీకి చెందిన కె.విజయేందర్‌రెడ్డి తన కుమార్తెను ఆస్పత్రికి తీసుకెళ్లి తిరిగి వచ్చాడు. ఇంటి ముందు కారు ఆపి ఆయనతో పాటు భార్య అల్లుడు దిగుతుండగా వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. విజయేందర్‌రెడ్డి, అతని భార్య నిర్మలారెడ్డి, అల్లుడు సాయిపవన్‌రెడ్డి యువకులను వారించగా మద్యం మత్తులో ఉన్న అఖిల్‌తో పాటు మరికొందరు కలిసి వారిపై దాడిచేశారు. దీంతో వారికి గాయాలయ్యాయి. బాధితులు మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయగా ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స అందించారు. దాడికి పాల్పడిన అఖిల్‌ను శాలివాహననగర్ కాలనీలోని మణికంఠ పూజా స్టోర్స్ యజమాని కుమారుడిగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడికి పరీక్షలు చేయగా మద్యం తాగినట్లు తేలింది. కేసును మలక్‌పేట ఎస్ఐ సంజీవరెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు
తప్పిపోయిన బాలుడు

మంగళ్‌హట్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటికి వెళ్లి తప్పిపోయిన ఓ బాలున్ని గంటల వ్యవధిలో గుర్తించి కుటుంబ సభ్యులకు మంగళ్‌హట్ పోలీసులు అప్పగించారు. ఈ మేరకు సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ ఎం.మహేశ్ కుమార్ వివరాలను వెల్లడించారు. మంగళ్‌హట్ మార్కెట్‌కు చెందిన సాజిదా ఖతూన్ మరిది కుమారుడు సలావుద్దీన్ సోమవారం ఉదయం ఇంటి నుంచి పనినిమిత్తం బయటికెళ్లి అదృశ్యమయ్యాడు. అతని కోసం స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వెతకగా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మంగళ్‌హట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇన్‌స్పెక్టర్ ఎం.మహేశ్‌కుమార్ వెంటనే స్పందించి మిస్సింగ్ కేసుగా నమోదు చేసి రెండు పోలీసు టీమ్‌లను రంగంలోకి దింపారు. సలావుద్దీన్ సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో తిరుగుతుండగా పట్టుకుని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పెట్రోల్ బంక్‌లో మహిళపై
దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు

మంగళ్‌హట్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంక్‌లో వాహనాల్లో పెట్రోల్ పోయించుకుంటుండగా ఇద్దరి మధ్య వివాదం తలెత్తింది. ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత పరిస్థితుల నెలకొన్నాయి. ఈ సంఘటన సోమవారం తెల్లవారుజామున ఆబిడ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల ప్రకారం... పాతబస్తీ ఉప్పుగూడ ప్రాంతానికి చెందిన విజయ్‌కుమార్ అతని కుటుంబ సభ్యులు మూడు ద్విచక్ర వాహనాలపై ఖైరతాబాద్‌లోని భారీ వినాయకున్ని చూసి తిరుగు ప్రయాణంలో ఇంటికి వెళ్తున్నారు. నాంపల్లిచౌరస్తా వద్ద ఉన్న పెట్రోల్‌బంక్‌లో తమ వాహనాల్లో పెట్రోల్ పోసుకునేందుకు క్యూలైన్‌లో నిలబడ్డాడు. కాగా విజయ్‌కుమార్ ద్విచక్ర వాహనం హసన్(35) అనే వ్యక్తి వాహనానికి తాకింది. దీంతో ఇద్దరి మధ్య స్వల్ప వివాదం తలెత్తింది. ఇద్దరూ అసభ్యపద జాలంతో దూషించుకున్నారు. దీంతో విజయ్‌కుమార్ భార్యపై కూడా హసన్ దాడి చేశాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో హసన్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ కావడంతో సెంట్రల్ అడిషనల్ ట్రాఫిక్ డీసీపీ ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలను సముదాయించి అక్కడి నుంచి పంపించడంతో పరిస్థితి సద్దుమణిగింది.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా ఎంఎంటీఎస్ రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. యాకత్‌పుర - ఉప్పుగూడ రైల్వే స్టేషన్ల మధ్య సోమవారం 45 ఏళ్ళ వయసు గల వ్యక్తి పట్టాలు దాటుతున్నాడు. వేగంగా వచ్చిన రైలు ఢీకొట్టడంతో అతడే అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.



క్రిస్టియల్ విల్లాస్ వినాయక మండపం వద్ద పూజల్లో పాల్గొన్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, కాంగ్రెస్ నేతలు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్ తదితరులు



బడంగ్‌పేట్‌లోని వినాయకుడిని కుమారుడు కౌశిక్‌రెడ్డితో కలిసి దర్శించుకున్న ఎమ్మెల్యే సబితారెడ్డి



బాలాపూర్ వినాయకుడిని దర్శించుకున్న ఎంపీ డీకే అరుణకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఉత్సవ సమితి అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి

గణపయ్యకు ఘన పూజలు

● వేడుకలు ముగింపు దశకు చేరుకోవడంతో మరింత సందడిగా గణేశ్ మండపాలు
● వినాయక మండపాలను సందర్శించి పూజలు చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు
● రికార్డు స్థాయిలో లడ్డూ వేలం పాటలు.. చాలా ప్రాంతాల్లో రూ.లక్షకు పైమాటే

సరూర్‌నగర్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రుల వేడుకలు ముగింపు దశకు చేరుకోవడంతో సోమవారం వినాయక మండపాల వద్ద మరింత సందడి వాతావరణం నెలకొంది. అన్నదానాలు, లడ్డూ వేలం పాటలు, భజనలు హోరెత్తాయి. బాలాపూర్‌లోని ప్రధాన వినాయకుడిని సోమవారం మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సహా పలువురు ప్రముఖులు దర్శించుకోగా, ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి వారిని సత్కరించి ప్రసాదాలు అందజేశారు. బడంగ్‌పేట్ మేయర్ పారిజాతానర్సింహారెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు అందెల శ్రీరాములుయాదవ్, కొలన్ శంకర్‌రెడ్డి తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.



తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్‌లో పూజలు చేసిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, తుర్కయంజాల్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ హరితాధన్‌రాజ్‌గౌడ్



మునగనూరు యాదాద్రినగర్, మల్లికార్జుననగర్, తులసివనం, వెంకటేశ్వరకాలనీలలో ప్రతిష్ఠించిన గణనాథులను దర్శించుకున్న కౌన్సిలర్ వేముల స్వాతి అమరేందర్‌రెడ్డి

బడంగ్‌పేట్‌లో ఎమ్మెల్యే సబితారెడ్డి పూజలు

బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని వివిధ డివిజన్లలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను సోమవారం మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి తన కుమారుడు కౌశిక్‌రెడ్డితో కలిసి దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆయా మండపాల వద్ద నిర్వాహకులు ఆమెను ఘనంగా సన్మానించారు. స్థానిక కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

కర్మన్‌ఘాట్‌లో..

చంపాపేట,(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ దేవస్థానంలో ఏర్పాటు చేసిన విజయ వినాయకస్వామి నిమజ్జన కార్యక్రమం సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఇన్‌చార్జి ఈఓ ప్రేమ్‌కుమార్‌రావు, వేద పండితులు, అర్చకులు గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఊరేగింపు నిర్వహించి తుర్కయంజాల్ చెరువులో నిమజ్జనం కోసం తరలించారు.



గడ్డిఅన్నారం గౌడ బస్తీలోని శ్రీగణేశ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో కొలువుదీరిన వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి తదితరులు

తట్టిఅన్నారంలో..

అబ్దుల్లాపూర్‌మెట్,(ఆంధ్రజ్యోతి): తట్టిఅన్నారంలోని మారుతీనగర్ కాలనీలో గణేష్ ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన మండపంలో వినాయకుడి లడ్డూను రూ.35,600లకు రాజేంద్రనగర్‌కు చెందిన రమేష్‌గౌడ్ దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు భాస్కరాచారి, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, మధు, రమణ, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ వేలాలు..



గాయత్రినగర్ ఫేజ్-4లో వినాయక లడ్డూను రూ.1.36 లక్షలకు కైవసం చేసుకున్న రవి తుపాకి



ఎల్‌సీహెచ్ కాలనీలో లడ్డూను రూ.1.20 లక్షలకు దక్కించుకున్న రాఘవాచారి



తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ శ్రీశ్రీనగర్ కాలనీలో హనుమాన్ యూత్ అసోసియేషన్ లడ్డూను రూ.78,116కు కైవసం చేసుకున్న బొమ్మరాజు వెంకటేష్



నాదర్‌గుల్ సిద్ధార్థనగర్ కాలనీలోని రూ.1.01 లక్షలకు లడ్డూను కైవసం చేసుకున్న బాబూరామ్ నాయక్



బడంగ్‌పేట్‌లోని బాలాజీనగర్ కాలనీలోని గణనాథుడి లడ్డూను రూ.1.53 లక్షలకు దక్కించుకున్న అశోక్‌రెడ్డి కుటుంబ సభ్యులు



బాలాపూర్ గణపయ్యను దర్శించుకున్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక, మేయర్ పారిజాతారెడ్డి తదితరులు



సిరిపురం కాలనీలో గణేశ్ నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తదితరులు



మనోహర్‌నగర్ లంబోదరుడిని దర్శించుకున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సామ సుందర్‌రెడ్డి



కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ దేవస్థానంలో నిర్వహించిన గణేశుడి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

అమరుల ఆశయ సాధనకు కృషి చేయాలి

● పార్టీ శ్రేణులకు సీపీఎం నేత నర్సిరెడ్డి పిలుపు

వనస్థలిపురం, సెప్టెంబర్ 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అసువులు బాసిన అమరుల ఆశయసాధనకు కృషి చేయాలని సీపీఎం రంగారెడ్డి జిల్లా నాయకులు కీసరి నర్సిరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం వనస్థలిపురం డివిజన్ చింతల్‌కుంటలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద బైక్ ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ.. నవాబు, భూస్వామి దొరల వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా సాగిన పోరాటాన్ని నేడు కొంత మంది వక్రీకరించి హిందూ, ముస్లింల పోరాట చరిత్రగా మార్చాలని కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. చరిత్రను వక్రీకరిస్తే ప్రజలు క్షమించరన్నారు. సీపీఎం సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, సీహెచ్ వెంకన్న, కనకయ్య, వీరయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

నాగోల్‌లో రైతాంగ పోరాట వారోత్సవాల సభ..

మన్సూరాబాద్, సెప్టెంబర్ 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ విముక్తికి ఎంతగానో దోహదపడిన రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కామ్రేడ్ రవీంద్రాచారి డిమాండ్ చేశారు. సాయుధ పోరాట వారోత్సవాలను సీపీఐ సరూర్‌నగర్ మండల సహాయ కార్యదర్శి బోయపల్లి రాములుగౌడ్ ఆధ్వర్యంలో సోమవారం నాగోల్‌లోని ఎస్‌ఏ డేంగే గార్డెన్‌లో నిర్వహించారు. పోరాటంలో తొలి అమరులైన దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, మగుల్ మొహిద్దిన్, రావి నారాయణరెడ్డి వంటి అనేక మంది తెలంగాణ విముక్తికి పాటుపడ్డారని, వారి ఆశయ సాధనకు నిరంతరం పోరాడతామని పేర్కొన్నారు. బాతరాజు నర్సింహా, కందుల సుధాకర్, మద్దిలేటి, బాతరాజు రేణుక తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న నర్సిరెడ్డి తదితరులు



సమావేశంలో మాట్లాడుతున్న కామ్రేడ్ రవీంద్రచారి

నెల రోజుల్లో 8 బైకులు చోరీ

● బైక్ దొంగల ఆటకట్టించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు
● ఇద్దరి అరెస్టు, బైక్‌లు స్వాధీనం

హైదరాబాద్‌సిటీ, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో వరుస బైక్ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు ఘరానా దొంగల పోలీసులు ఆటకట్టించిన వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారి నుంచి 8 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల సిటీ కమిషనరేట్ పరిధిలోని ఎస్ఆర్‌నగర్, బంజారాహిల్స్, మధురానగర్, కాచిగూడ, దోమలగూడ తదితర ప్రాంతాల్లో వరుసగా బైక్ చోరీలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర ఆదేశాలతో వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగారు. టెక్నికల్ ఎవిడెన్స్ సేకరించి నేరస్థులపై నిఘా పెట్టి ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను పట్టుకున్నారు.

నెల క్రితం జైలు నుంచి బయటకు..

వారిని విచారించగా ఇద్దరూ కడప జిల్లాకు చెందిన ధర్మతేజ అలియాస్ సన్నీ, గుర్రప్ప అలియాస్ సంపత్‌గా తేలింది. ధర్మతేజ గతంలో కడప, విజయవాడ, హైదరదాబాద్‌లలో బైక్ చోరీలకు పాల్పడి జైలుకు వెళ్లాడు. ఆగస్టు మొదటి వారంలో జైలు నుంచి విడుదలైన సన్నీ తన స్నేహితుడు సంపత్‌తో కలిసి ముఠాగా ఏర్పడ్డాడు. హైదరాబాద్‌లో బైక్‌లు చోరీచేసి, డబ్బులు సంపాదించాలని పథకం వేశాడు, ఇద్దరూ కలిసి ఇటీవల నగరంలో నెల రోజుల వ్యవధిలోనే 8 బైక్‌లు చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఎస్ఆర్‌నగర్ పోలీసులు నిందితులను రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక నుంచి టెట్రా మద్యం..

● నగరంలో విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

పేట్‌బషీరాబాద్ సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇతర రాష్ట్రాల నుంచి గుట్టుచప్పుడు కాకుండా టెట్రా మద్యం ప్యాకెట్లు తెచ్చి నగరంలో విక్రయించేందుకు యత్నిస్తున్న వ్యక్తిపై కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ మహదేవపురంలో నూతనంగా నిర్మాణం జరుగుతున్న భవనం వద్ద శివ సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. కర్ణాటక రాష్ట్రం సేడం జిల్లా నుంచి ఓ ప్రైవేట్ ట్రావెల్స్‌లో 67 టెట్రా మద్యం ప్యాకెట్లు తీసుకొచ్చాడు. నగరంలో విక్రయిస్తున్నట్టు సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు అతను సెక్యూరిటీగా ఉంటున్న నిర్మాణ భవనం వద్ద దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు అతడి వద్ద ఉన్న టెట్రా మద్యం ప్యాకెట్స్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

హైదర్‌నగర్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): రెండు బైక్‌లు ఢీ కొనడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాలకు చెందిన శ్రావణ్‌కుమార్ కేపీహెచ్‌బీ రోడ్ నంబర్-1లో నివాసం ఉంటాడు. సోమవారం మధ్యాహ్నం ఇంటికి వెళ్లేందుకు స్నేహితుడు రాఘవేంద్రరావుతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తూ యూటర్న్ తీసుకునే క్రమంలో ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొట్టింది. శ్రావణ్‌కుమార్ తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం దగ్గరలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

'సేవా కార్యక్రమాల నిర్వహణ అభినందనీయం'

చిక్కడపల్లి, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): సేవా, సంగీత కార్యక్రమాలు నిర్వహించడం అభినందీయమని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు నల్లూరి సుధీర్‌కుమార్ అన్నారు. ప్రవీణ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం త్యాగరాయగానసభలో సినీసంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. పదిహేను సంవత్సరాలుగా ప్రవీణ్ కల్చరల్ అసోసియేషన్ సంస్థ సంగీత, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో గాయకులు గుర్నాప్రసాదరావు, పవన్‌కుమార్, దేవీకృష్ణ, హరి విమల, శ్యామల తదితరులు అక్కినేని, లతామంగేష్కర్ పాటలు పాడారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళి



నాగరత్నం, అనిల్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఆకుల రవీందర్‌రావు

బర్కత్‌పుర, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): మోక్షగుండం విశ్వేశ్వరయ్యను నేటి ఇంజనీర్లు ఆదర్శంగా తీసుకోవాలని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ రాయల్ డిస్ట్రిక్ట్ చైర్మన్ ఆకుల రవీందర్‌రావు, అధ్యక్షుడు వాయిల శ్రీనివాస్‌రావు సూచించారు. ఇంజనీర్స్ డే సందర్భంగా సోమవారం బర్కత్‌పురలోని సిటిజన్స్ కౌన్సిల్ కార్యాలయంలో ప్రొఫెసర్ మేడిశెట్టి నాగరత్నం, డాక్టర్ అనిల్‌కుమార్, ఐటీఐ రిటైర్డ్ ప్రిన్సిపాల్ పరమేశ్వర్‌రావును సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాగరత్నం జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా, డాక్టర్ అనిల్‌కుమార్ కమలానెహ్రూ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారని తెలిపారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దశరథ్

సాంస్కృతిక కార్యక్రమాలతో మానసిక ఆనందం

చిక్కడపల్లి, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక కార్యక్రమాలు మానసిక ఆనందాన్నిస్తాయని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రచార కార్యదర్శి జంగం దశరథ్ అన్నారు. శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం త్యాగరాయగానసభలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోజంతా ఉద్యోగం, బిజినెస్‌తో అలసిపోయేవారికి సాంస్కృతిక కార్యక్రమాల వీక్షణం ప్రశాంతతను ఇస్తుందన్నారు. దశరథ్‌ను ఇండియా స్వర్ణభారతి అవార్డుతో నిర్వాహకులు సత్కరించారు. నాట్యగురువు వల్లభనేని సజని, బీజేపీ నేత వంశీ, నిర్వాహకుడు జి. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్ కుమార్ తదితరులు

సమగ్ర కులగణనను వెంటనే చేపట్టాలి

తార్నాక, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో వెంటనే సమగ్ర కులగణనను చేపట్టాలని తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ (టీఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్ కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ విద్యార్థి నాయకులు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బారి అశోక్ కుమార్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను అమలు చేయడంతో పాటు, ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌పార్టీ కామారెడ్డిలో ప్రకటించిన విధంగా బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు నూకల మధుయాదవ్, పవన్ వర్మ, మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.